క్లుప్తంగా

పోచమ్మ ఎమ్మెల్యే పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లి గ్రామ శివారులోని పలుగు మీది నల్లపోచమ్మ దేవికి ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేకు అర్చకులు రాజు శాలువాతో సత్కరించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి



నీటిని విడుదల చేస్తున్న నాయకులు, అధికారులు

వట్‌పల్లి(అందోల్): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జోగిపేట ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం వానా కాల ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తాలెల్మ రేణుక ఎల్లమ్మ ఎత్తిపోతల ద్వారా సాగునీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. ఎకరానికి రూ.6వేల పెట్టుబడి సహాయం అందించడంతో పాటు పండించిన పంటలకు మద్దతు ధర ప్రభుత్వం కల్పించడం, సాగునీరు, ఉచిత కరెంట్ అందజేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంలోనే వ్యవసాయానికి పండగలా సాగుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ విక్రం, ఏఈ మజర్‌అలీ, ఏయంసీ మాజీ చైర్మెన్ పద్మనాభరెడ్డి, మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎత్తిపోతల పథకం చైర్మన్ లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దుర్గాప్రసాద్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం సెక్షన్‌లో పని చేస్తున్న విద్యుత్ కార్మికులతో గుమ్మడిదల ఏఈడీ దుర్గాప్రసాద్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినప్పుడు గృహ వినియోగదారులకు పలు సూచనలను వివరించారు. తెగిపడిన, వేలాడుతూ వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం భద్రతా పరికరాల కిట్లను సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో బొంతపల్లి, జిన్నారం ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మాజీ సర్పంచ్ శివచరణ్

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మర్వెల్లి గ్రామానికి చెందిన మంగళి లింగంకు మంజూరైనా సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ శివశరణ్ లబ్ధిదారుడికి అందజేశాడు. పేదలకు ఆపదకాలంలో సీఎం రిలీఫ్‌ఫండ్ ఓ వరమని దీని ద్వారా వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు బస్వరాజ్,వీరయ్య, ఎస్ఎంసీ మాజీ చైర్మెన్ నర్సింలు, శ్రీనివాస్, సిద్దయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: కంగ్టి మండలం సర్దార్ తండాకు చెందిన గోవింద్ మహారాజ్ కూతురి వివాహం ఇటీవల జరిగింది. ఆమెకు కల్యాణ లక్ష్మి పథకం నుంచి చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశాల మేరకు చెక్కును బుధవారం ఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి అందజేశారు. మాజీ ఎంపీటీసీ అర్జున్, నాయకులు జ్ఞానేశ్వర్ పాటిల్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. తప్పదు చింత

- అధ్వానంగా సిద్దాపూర్, రేజింతల్ రోడ్లు
- వాహనదారులకు తప్పని తిప్పలు



సదాశివపేట సబ్‌స్టేషన్ నుంచి సిద్దాపూర్ వైపు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

సదాశివపేట (సంగారెడ్డి): పట్టణ పరిధిలోని సిద్దాపూర్, డబుల్‌బెడ్రూమ్, రేజింతల్ వరకు దాదాపు నాలుగు కిలోమీటర్ల వరకుగల బీటీ రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అడుగడుగునా గోతులు, రాళ్లతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. వీటిపై ప్రయాణమంటనే వాహనచోదకులు హడలిపోతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ గుంతలు పడి దారుణంగా తయారయ్యాయి. చినుకుపడితే రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లు వాహనచోదకులు, ప్రయాణికులు, పాదచారులు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి. పట్టణంలోని సబ్‌స్టేషన్ నుంచి సిద్దాపూర్ గ్రామం వరకు హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి డబుల్ బెడ్రూం ఇళ్లు, రేజింతల్ వరకు రహదారులు దారుణంగా మారాయి. సబ్‌స్టేషన్ నుంచి సిద్దాపూర్, శ్రీకృష్ణానగర్ కాలనీల మధ్య ఉన్న ప్రభుతధ్వాస్పత్రికి నిత్యం రోగులు, ప్రజలు ఈ గుంతలు పడిన రహదారి మీదుగానే అవస్థలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. సబ్‌స్టేషన్ నుంచి డబుల్ బెడ్రూం ఇళ్ల వరకు గల గుంతలు పడి అస్తవ్యస్తంగా తయారైన రహదారుల మీదుగా మండలంలోని రేజింతల్, కొండాపూర్ మండలం అనంతసార్, మారేపల్లి, గంగారం, గోటిలకుంట తండా, చీమలదారి కొనాపూర్, సైదాపూర్, సైదాపూర్ తండాల మీదుగా వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలోని పలు గ్రామాలకు ద్విచక్ర వాహనచోదకులతోపాటు కార్లు, ఆటోలు, బస్సులు వెళుతుంటాయి. వర్షం కురిసినప్పుడు గోతుల్లో వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్లపై రాత్రి ప్రయాణం చేయాలంటే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ పరిధిలో రహదారులు పంచాయతీ ఇంజనీరింగ్ పరిధిలో ఉన్నాయని మున్సిపల్ ఇంజనీర్ రాజేష్ తెలిపారు. పంచాయతీరాజ్ అధికారులను ఫోన్‌లో చేసినా వారు స్పందించలేదు.



సదాశివపేటలోని సిద్దాపూర్, రేజింతల్‌కు వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలు

పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపల్ పట్టణం పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోని మురుగు తొలగింపు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదల నరికివేత, నీరు నిల్వ ఉన్న ఖాళీ ప్రదేశాలు, మురుగు కాల్వల్లో దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్ వదిలారు. రోడ్లపై నిలిచిన వరదనీరు మురుగు కాల్వల్లోకి వెళ్లేలా జేసీబీతో కాల్వల చేశారు. తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పనులను కమిషనర్‌తోపాటు మెనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, ఆయా వార్డుల అధికారులు పర్యవేక్షించారు.



పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ జగ్జీవన్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

జహీరాబాద్ టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మొగుడంపల్లి మండలం ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మొబైల్ ద్వారానే అధికశాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రాజేందర్‌రెడ్డి

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 72 గంటల బంద్ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతులను బహిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయంగా ఫీజులు చెల్లించే స్థోమత లేని పేద విద్యార్థులు చదువులు మానేయాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, ఆకాష్, ఏలియా, మహేష్, నవాబ్‌అలీ, సంధ్య, మహేశ్వరీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి

సదాశివపేట(సంగారెడ్డి): భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వాలంటీర్లు, అధ్యాపకులు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనమహోత్సవం ఏడు రోజుల పాట జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మురళీకృష్ణ, శకుంతల, సావిద్య, సర్వయ్య, రాజిరెడ్డి, మంజుల, స్రవంతి, రాధారేఖ వాలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కాంగ్రెస్ నేతల నివాళి



మృతులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి నివాళులర్పించారు. బొల్లారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ రెడ్డి, అమర్ యాదవ్, ఉమేష్ సింగ్, బోవేలాల్, భైరాన్ యాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ మధ్య చెత్తకుప్పలు తొలగించండి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ 284/1 సర్వే నంబర్‌లో గత ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ఎకరా స్థలం కేటాయించింది. ఎలాంటి నిర్మాణం పనులు చేపట్టక పోవడంతో ఈ స్థలం ఖాళీగా ఉంది. దీంతో స్థానికంగా నివాసముండే ఇళ్లల్లోని చెత్తా చెదారాన్ని ఆ స్థలంలో పడేస్తున్నారు. పెద్దెత్తున చెత్త వేయడంతో దుర్వాసన, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. బుధవారం స్థానిక యువకులు మున్సిపల్ కమిషనర్ కిషన్‌ను కలిసి ప్రాంతాన్ని శుభ్రపరచాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌వో నర్సింలు, యువకులు అర్జున్, హరీష్, ఆనంద్, ఆదర్శ్ యువరాజ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా(కె) గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అల్లా భక్ష్(28) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

కాలిన ఎంసీబీ స్విచ్‌లు

నారాయణఖేడ్: మూడు రోజులుగా వర్షం కురుస్తుంది. దీంతో ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని వీధి దీపాలు, బట్టర్‌ఫ్లై లైట్లకు సంబంధించి రాయిపల్లిరోడ్డు, బసవేశ్వర చౌక్, ఏఎస్‌నగర్ కాలనీ, ర్యాకల్‌రోడ్డులో ఉన్న ఎంసీబీ స్విచ్‌లు కాలిపోయాయి. దీంతో ప్రధాన రహదారులు, కాలనీల్లో రాత్రుల్లో అంధకారం నెలకొనే అవకాశం ఉండటంతో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ విద్యుత్తు విభాగం పర్యవేక్షకులు అమర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్లు ఆయా ఎంసీబీ స్విచ్‌లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటుచేశారు. పట్టణ శివారులోని సంపుహౌస్‌లో ఫ్యూజులు కాలిపోగా కొత్త వాటిని బిగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ బాలలక్ష్మి సూచించారు. పదో తరగతి పాసైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల మహిళలు ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇళ్లు.. ఇంకెనాళ్లు?

- 'డబుల్' ఇళ్ల కేటాయింపులో జాప్యం
- పట్టాల పంపిణీ చేసి ఏడాది
- ఆందోళనలో లబ్ధిదారులు



జహీరాబాద్ మండలం హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూంలు

జహీరాబాద్ టౌన్: డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఇళ్ల పట్టాలను సైతం అందజేశారు. అయితే ఏడాదిన్నర గడుస్తున్నా ఇళ్లను అప్పగించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. అయితే ఇళ్లు అప్పగించాలని లబ్ధిదారులు ఆందోళన చేస్తున్నారు. వారం రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నారు.

రూ. 36 కోట్లు.. మూడంతస్తుల బ్లాక్

గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పథకాన్ని చేపట్టింది. జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హోతి(కె) వద్ద 660 డబుల్ బెడ్రూం ఇళ్లను కట్టించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5.04 లక్షల చొప్పున రూ. 36 కోట్లతో మూడంతస్తుల బ్లాక్‌గా నిర్మించారు. ప్రారంభంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగాయి. మధ్యలో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రెండేళ్ల క్రితం అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు, అప్పటి కలెక్టర్ శరత్ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్షించారు. హోతి(కె) గ్రామానికి వెళ్లి పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్ ను మార్చి మిగులు పనులను పూర్తి చేయించాలని అప్పట్లో సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి పూర్తి చేయించారు. నిర్మాణం పనులు దాదాపు పూర్తి కాగా లబ్ధిదారులకు కేటాయించడమే మిగిలింది.

లబ్ధిదారుల ఎంపిక చేపట్టినా..

అసెంబ్లీ ఎన్నికలకు మందు డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపికచేసి జాబితాను సిద్ధం చేశారు. ఈ మేరకు లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు ఇళ్ల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సుమారు రెండు సంవత్సరాలు కావొస్తున్న ఇళ్లను అప్పగించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వారం నుంచి రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నారు. సీపీఎం నాయకులు లబ్ధిదారులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ దశరథ్ దృష్టికి తీసుకెళ్లగా ఉన్నత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్: ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకున్న అడ్లూరి లక్ష్మణ్‌ను ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయనను కలిశారు. ఖేడ్ ప్రాంత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చెరకు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నూనె గింజల సాగు పెంచాలి

డీఏఓ శివప్రసాద్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఆహార ఉత్పత్తులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని హద్నూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన జాతీయ ఆహార భద్రత, నూనె గింజల పథకంలో భాగంగా నారింజ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు సోయాబీన్, ఎల్ఆర్‌జీ 52 కంది విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. వంట నూనెల దిగుమతుల కోసం ఏటా రూ. 1.38 లక్షల కోట్లను వెచ్చించాల్సి వస్తుందన్నారు. కంది, పెసర తదితరాల దిగుమతుల కోసం రూ. 42,800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. అయిల్, పెసర, కంది వంటి వాటి దిగుమతులను తగ్గించుకొనేందుకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై ఆయా విత్తనాలను ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, హద్నూర్ పీఏసీఎస్ చైర్మన్ జగనాథ్‌రెడ్డితో పాటు ఏఈఓలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల రుణాలు



ఆహార ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఉమ

మున్సిపల్ కమిషనర్ ఉమ

సదాశివపేట(సంగారెడ్డి): స్వయం సహాక సంఘాలకు బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఉమా పేర్కొన్నారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని 13 స్వయం సహాయక సంఘాలకు ఎస్‌బీఐ ,ఏడీబీ బ్యాంకులు మంజూరు చేసిన రూ. 2కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కును బుధవారం మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, లక్ష్యం నిర్దేశించుకుని ఆర్థికాభివృద్ధి వైపు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో టీఎంసీ సువర్ణ, సీఓ రమాదేవి, డీఈఓ రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల స్టాల్స్ పరిశీలన

వీధి వ్యాపారులు పట్టణంలోని దుర్గాభవానీ మందిరం వద్ద అమ్మకానికి ఏర్పాటు చేసిన స్టాళ్లను వివిధ రకాల ఆహార ఉత్పత్తులను మున్సిపల్ కమిషనర్ ఉమ పరిశీలించారు. బుధవారం వారాంతపు సంత కావడంతో ఆహార ఉత్పత్తులను అమ్మకానికి పెట్టారు. మంచి నాణ్యమైన ఉత్పత్తులను

వర్క్‌షాప్‌కు జహీరాబాద్ మహిళా నేత



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అస్మా (ఎడమ వైపు వృత్తంలో ఉన్న మహిళ)

జహీరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌లో జహీరాబాద్ మహిళా కాంగ్రెస్ నేత అస్మా పాల్గొన్నారు. మహరాష్ట్రలోని సేవాగ్రామ్‌లో గల గాంధీ ఆశ్రమంలో గత నెల 27 నుంచి వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వివిధ ప్రక్రియల ద్వారా ఎంపిక చేసిన 40 మంది మహిళలకు ప్రత్యేకంగా వర్క్‌షాప్‌కు ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మాతో పాటు మరో మహిళా నేత విజయలక్ష్మి హాజరయ్యారు. బుధవారం జహీరాబాద్‌కు తిరిగి వచ్చిన అస్మా విలేకరులతో మాట్లాడారు. మహిళలు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించేందుకు గాను నేర్చుకోవాల్సిన అంశాలపై వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.